

## రుద్రాంక్ష్, ఆర్యకు రజతం

- భారత్ ఖాతాలో ఏడు పతకాలు

బ్యూనస్ ఎయిర్స్(అర్జెంటీనా): ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత్ ఖాతాలో మరో రజతం చేరింది. బుధవారం జరిగిన పది మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత జోడీ ఆర్య-రుద్రాంక్ష్.. 9 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచారు. చైనా ద్వయం వాంగ్ జిఫీ-సంగ్ బుహాన్ 17 పాయింట్లతో స్వర్ణం దక్కించుకుంది. మంగళవారం రాత్రి ముగిసిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత యువ షూటర్ విజయ్‌వీర్ సిద్ధు స్వర్ణం గెలుచుకున్నాడు. భారత్ ఏడు పతకాలతో రెండో స్థానంలో ఉంది.

## బీఎఫ్ఐ వ్యవహారాలకు మధ్యంతర కమిటీ

ఢిల్లీ: బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎఫ్ఐ) వ్యవహారాలను చూసుకునేందుకు గాను వరల్డ్ బాక్సింగ్ మధ్యంతర కమిటీని ఏర్పాటు చేసింది. బీఎఫ్ఐ ఎన్నికల నేపథ్యంలో దేశంలో బాక్సర్ల శిక్షణ, టోర్నీలకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో బీఎఫ్ఐ చైర్మన్ అజయ్ సింగ్ అభ్యర్థన మేరకు వరల్డ్ బాక్సింగ్ అధ్యక్షుడు బోరిస్ వాన్‌డర్.. ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు.

### పాయింట్ల పట్టిక

| జ | మ్యా | గె | ఓ | పా | ర.రే |
|---|---|---|---|---|---|
| గుజరాత్ | 5 | 4 | 1 | 8 | 1.41 |
| ఢిల్లీ | 3 | 3 | 0 | 6 | 1.25 |
| బెంగళూరు | 4 | 3 | 1 | 6 | 1.01 |
| పంజాబ్ | 4 | 3 | 1 | 6 | 0.28 |
| లక్నో | 5 | 3 | 2 | 6 | 0.07 |
| కోల్‌కతా | 5 | 2 | 3 | 4 | -0.05 |
| రాజస్థాన్ | 5 | 2 | 3 | 4 | -0.73 |
| ముంబై | 5 | 1 | 4 | 2 | -0.01 |
| చెన్నై | 5 | 1 | 4 | 2 | -0.88 |
| హైదరాబాద్ | 5 | 1 | 4 | 2 | -1.62 |

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

# గుజరాత్ ఘనంగా..

**గుజరాత్ టైటాన్స్ టాప్ గేర్‌లో దూసుకెళుతున్నది. ప్రత్యర్థి ఎవరన్నది లెక్కచేయని నైజంతో సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ వరుస విజయాలు సొంతం చేసుకుంటున్నది. సొంత ఇలాఖాలో రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ ఘన విజయం సాధించింది. సాయి సుదర్శన్ సమయోచిత అర్ధసెంచరీతో భారీ స్కోరు అందుకున్న టైటాన్స్...రాజస్థాన్‌ను కట్టడి చేయడంలో సఫలమైంది. ప్రసిద్ధ్ కృష్ణ, సాయి కిశోర్ రాణించడంతో రాయల్స్ ఓటమివైపు నిలిచింది.**

**రాజస్థాన్‌పై భారీ విజయం • రాణించిన సుదర్శన్, ప్రసిద్ధ్ కృష్ణ**

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 58 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌పై ఘన విజయం సాధించింది. తొలుత సాయి సుదర్శన్ (53 బంతుల్లో 82, 8ఫోర్లు, 3సిక్స్‌లు) అర్ధసెంచరీకి తోడు బట్లర్ (36), షారుఖ్‌ఖాన్(36) రాణించడంతో టైటాన్స్ 20 ఓవర్లలో 217/6 స్కోరు చేసింది. తుషార్ (2/53), తీక్షణ (2/54) రెండేసి వికెట్లు తీశారు. లక్ష్యఛేదనకు దిగిన రాజస్థాన్ 159 స్కోరుకు పరిమితమైంది. హెట్‌మైర్(32 బంతుల్లో 52, 4ఫోర్లు, 3సిక్స్‌లు), శాంసన్(41) రాణించినా లాభం లేకపోయింది. ప్రసిద్ధ్ కృష్ణ (3/24), సాయి కిషోర్(2/20).. రాయల్స్‌ను దెబ్బతీశారు.

### సూపర్ సుదర్శన్

ఐపీఎల్‌లో తన అరంగేట్రం (2022) నుంచి నిలకడగా ఆడుతూ గుజరాత్ జట్టులో స్థానాన్ని సుస్థిరం చేసుకున్న సుదర్శన్.. మరోసారి నిలకడను చాటుకున్నాడు. అహ్మదాబాద్‌లో మ్యాచ్ అంటేనే చెలరేగే (ఇక్కడ ఆడిన 15 ఇన్నింగ్స్‌లలో అతడు 58.71 సగటుతో 822 పరుగులు చేశాడు) అతడు.. రాజస్థాన్‌తో పోరులోనూ చెలరేగాడు. జోఫ్రా ఆర్చర్ కొత్త బంతితో నిప్పులు చెరగడంతో మూడో ఓవర్లోనే టైటాన్స్.. గిల్ (2) వికెట్‌ను కోల్పోయినా బట్లర్ (25 బంతుల్లో 36, 5 ఫోర్లు), షారుఖ్ ఖాన్ (20 బంతుల్లో 36, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) అండతో అతడు గుజరాత్‌ను పటిష్ట స్థితిలో నిలిపాడు. తుషార్ 5వ ఓవర్లో ఫైన్ లెగ్ మీదుగా భారీ సిక్సర్ బాదిన సుదర్శన్.. అదే ఓవర్లో మరో రెండు బౌండరీలు రాబట్టాడు. బట్లర్ కూడా ఫజల్‌హక్, తీక్షణ ఓవర్లలో రెండేసి ఫోర్లు కొట్టాడు. తీక్షణ పదో ఓవర్లో సింగిల్‌తో 32 బంతులో సాయి అర్ధశతకం పూర్తయింది. ఈ సీజన్‌లో అతడికి ఇది మూడో హాఫ్ సెంచరీ కావడం విశేషం. కానీ ఇదే ఓవర్లో ఆఖరి బంతికి బట్లర్.. వికెట్ల ముందు దొరికిపోవడంతో 80 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. నాలుగో స్థానానికి ప్రమోట్ అయిన షారుఖ్ సైతం ఉన్నంతసేపు ధాటిగా ఆడాడు. తీక్షణ ఓవర్లో అతడు.. 6, 4, 4 తో అలరించాడు. కానీ అతడే వేసిన 16వ ఓవర్లో ముందుకొచ్చి ఆడబోయి స్టంపౌట్ అయ్యాడు. క్రమం తప్పకుండా వికెట్లు పడుతున్నా సుదర్శన్ వేగంగా ఆడటంతో టైటాన్స్ స్కోరు పరుగులు పెట్టింది. కానీ తుషార్ 19వ ఓవర్లో.. శాంసన్‌కు క్యాచ్ ఇవ్వడంతో సుదర్శన్ ఇన్నింగ్స్ ముగిసింది. ఆఖర్లో తెవాటియా (12 బంతుల్లో 24 నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) మెరుపులతో రాజస్థాన్ ఎదుట టైటాన్స్ భారీ లక్ష్యాన్ని నిలిపింది.

### రాయల్స్ ఢమాల్:

ఛేదనను రాజస్థాన్ కూడా దూకుడుగానే ఆరంభించినా కీలక సమయాల్లో వికెట్లు కోల్పోయి చతికిలపడింది. రెండు పరుగుల వ్యవధిలోనే జైస్వాల్ (6), రాణా (1) వికెట్లను కోల్పోయినా సారథి శాంసన్, పరాగ్ (14 బంతుల్లో 26, 1 ఫోర్, 3 సిక్సర్లు) ధాటిగా ఆడారు. పవర్ ప్లేలో ఈ ఇద్దరూ ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడటంతో 6 ఓవర్లకు ఆ జట్టు 57/2గా నిలిచింది. కానీ బౌలింగ్ మార్పుగా వచ్చిన కెజ్రొలియా.. ఏడో ఓవర్లో పరాగ్‌ను ఔట్ చేశాడు. మరుసటి ఓవర్లోనే రషీద్ ఖాన్.. జురెల్ (5)నూ పెవిలియన్‌కు పంపి రాయల్స్ ఆశలపై నీళ్లు చల్లాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన హెట్‌మైర్ దూకుడు ప్రదర్శించాడు. శాంసన్ జతగా బౌండరీలతో చెలరేగాడు. ఇద్దరు మంచి టచ్‌లోకి వచ్చారనుకున్న తరుణంలో శాంసన్ ఔట్ కావడం రాజస్థాన్ అవకాశాలను దెబ్బతీసింది. ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన శుభమ్ దూబే (1)ను రషీద్‌ఖాన్ పెవిలియన్ పంపగా, ఆఖరి వరుస బ్యాటర్లతో కలిసి హెట్‌మైర్ జట్టును గెలిపించే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది.



సుదర్శన్ (82)

**సంక్షిప్త స్కోర్లు:**
**గుజరాత్:** 20 ఓవర్లలో 217/6 (సుదర్శన్ 82, షారుఖ్ 36, తుషార్ 2/53, తీక్షణ 2/54);
**రాజస్థాన్:** 19.2 ఓవర్లలో 159 ఆలౌట్(హెట్‌మైర్ 52, శాంసన్ 41, ప్రసిద్ధ్ కృష్ణ 3/24, సాయికిషోర్ 2/20)

## సింధు, రజావత్ శుభారంభం

**తొలి రౌండ్ లోనే ప్రణయ్, లక్ష్యసేన్ ఔట్**



నింగ్బో (చైనా): బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్స్‌లో రెండో రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. పీవీ సింధుతో పాటు కిరణ్ జార్జి, ప్రియాన్షు రజావత్ వంటి స్టార్ షట్లర్లు ప్రిక్వార్టర్స్‌కు చేరినా లక్ష్యసేన్, ప్రణయ్, మాళవిక, ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్ విఘ్నాన్ని దాటలేకపోయారు. మహిళల సింగిల్స్‌లో సింధు 21-15, 21-9తో ఎస్తర్ నురుమి (ఇండోనేషియా)పై అలవోక విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో రజావత్ 20-22, 21-12, 21-10తో వాంగ్‌చరొన్(థాయ్‌లాండ్) పై పోరాడి గెలిచాడు. జార్జి 21-16, 21-8తో పనరిన్ (కజకిస్థాన్)ను చిత్తుగా ఓడించాడు. కానీ టోర్నీ ఫేవరెట్లలో ఒకడిగా బరిలోకి దిగిన లక్ష్యసేన్ 21-18, 21-10తో లి చియా హో(తైవాన్) చేతిలో పరాభవం పాలయ్యాడు. మరో పోరులో ప్రణయ్ 16-21, 21-12, 11-21తో లు గువాంగ్జు (చైనా) చేతిలో చిత్తయ్యాడు. ఈ ఏడాది ఆడిన ఆరు టోర్నీలలో తొలి రౌండ్‌లోనే వెనుదిరగడం అతడికి ఇది నాలుగోసారి కావడం గమనార్హం.



## షూటింగ్ విజేతలకు డీజీపీ అభినందన

హైదరాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): ఇండోర్(మధ్యప్రదేశ్)లో జరిగిన 18వ ఆల్‌ఇండియా పోలీసు స్పోర్ట్స్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో పతక విజేతలను డీజీపీ జితేందర్ అభినందించారు. బుధవారం డీజీపీ కార్యాలయంలో ఆయన వారిని సత్కరించారు. షూటింగ్ టోర్నీలో తెలంగాణకు మొత్తం 7 పతకాలు వచ్చాయి. ఇందులో వ్యక్తిగత విభాగంలో రాజ్‌కుమార్‌కు రజతం, మహిళల టీమ్ ఈవెంట్‌లో సువర్ణ, విజయమ్మ, మాధవి రజతాలు గెలువగా, పురుషుల టీమ్ విభాగంలో శ్రీనివాసరావు, శ్యామ్ సుందర్, రాజ్‌కుమార్‌కు మూడు కాంస్యాలు వచ్చినట్లు పోలీస్ అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐజీపీ(స్పోర్ట్స్) రమేశ్, డీఎస్పీ రామారావు పాల్గొన్నారు.

# 180 ప్లస్సా.. అయితే మేం డ్రాప్!

**ఐపీఎల్‌లో 5 సార్లు చాంపియన్.. 10 సార్లు ఫైనలిస్టులు.. అంతర్జాతీయ స్థాయి దిగ్గజాల ప్రాతినిధ్యం.. కెప్టెన్ కూల్ సారథ్యం.. అనామక ఆటగాళ్లతో చరిత్ర సృష్టించిన ఘనత.. సొంతగడ్డపై తిరుగులేని ఆధిపత్యం.. ఇన్ని ఉన్నా ఐపీఎల్‌లో గత ఆరేడేండ్లుగా చెన్నైని ఓ బలహీనత దారుణంగా వేధిస్తున్నది. ప్రత్యర్థి జట్టు తమ ఎదుట 180+ టార్గెట్ నిర్దేశించిందా? అంతే.. ఖేల్ ఖతం.. సీఎస్‌కే ఓటమి ఖరారైనట్టే!**

*నమస్తే తెలంగాణ క్రీడా విభాగం*



కదనరంగంలో మన బలాలను తెలుసుకోవడాని కంటే ముందు ప్రత్యర్థి బలహీనతలను గుర్తించడం ఎంతో కీలకం. తద్వారా వారిపై ఎలా దాడి చేయాలి? వారిని ఎలా ఓడించాలనే వ్యూహరచనలో ఇది ఎంతగానో తోడ్పడుతుంది. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)తో ఆడేప్పుడు ప్రత్యర్థి జట్లు ఈ సూత్రాన్ని తూచా తప్పకుండా పాటిస్తున్నాయి. ఈ లీగ్‌లో మరే జట్టుకూ లేని ఘనమైన ఘనతలను కలిగిన సీఎస్‌కేతో మ్యాచ్ ఆడుతూ.. మొదట బ్యాటింగ్ చేసి చెన్నై ముందు 180+ టార్గెట్ నిర్దేశిస్తే చాలు. ఆ జట్టుకు విజయం గ్యారెంటీ! గణాంకాలు చెబుతున్న కఠోర వాస్తవాలివి. రెండ్రోజుల క్రితం పంజాబ్ కింగ్స్‌తో ముల్లాన్‌పూర్ వేదికగా ఎదురైన ఓటమితో కలుపుకుని.. చెన్నై వరుసగా 11 అపజయాలను తమ ఖాతాలో వేసుకుంది.

### ఏడేండ్ల నుంచీ ఇదే కథ..

ఐపీఎల్‌లో చెన్నై ఆఖరిసారిగా 2018లో 180+ టార్గెట్‌ను ఛేదించింది. ఆ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో లీగ్, ప్లేఆఫ్స్‌లలో జరిగిన మ్యాచ్‌లలో సీఎస్‌కే.. 180 పరుగుల ఛేదనను రెండు సార్లు చేసింది. నాటి నుంచి మొన్నటి పంజాబ్‌తో మ్యాచ్ దాకా చెన్నై 11 సార్లు 180+ టార్గెట్ ఛేదించాల్సి వచ్చినా ఆ జట్టుకు పరాభవాలే ఎదురయ్యాయి. ఈ క్రమంలో 2025 సీజన్‌లోనే రుతురాజ్ సేన మూడు ఓటములు మూటగట్టుకుంది. బెంగళూరుతో మ్యాచ్‌లో ఆ జట్టు నిర్దేశించిన 197 పరుగుల ఛేదనలో చెన్నై.. 146/8 వద్దే ఆగిపోయింది. ఢిల్లీ 184 టార్గెట్‌ను నిర్దేశిస్తే 158/5తోనే సరిపెట్టుకుంది. పంజాబ్‌తోనూ పోరులోనూ ఇదే రిపీట్ అయింది. పంజాబ్‌తో పోరును మినహాయిస్తే.. బెంగళూరు, ఢిల్లీతో సొంతగడ్డపై చెన్నైకి ఘనమైన రికార్డు ఉండేది. చెపాక్‌లో 2010 నుంచి ఆర్‌సీబీ, ఢిల్లీ చేతిలో ఓటములు ఎరుగని చెన్నైకి ఈ సీజన్‌లో పరాభవాలు తప్పలేదు. ఛేదనలో టాపార్డర్ వైఫల్యంతో ఆరంభంలోనే తడబడుతున్న రుతురాజ్ సేన.. మధ్య ఓవర్లలో మరీ దారుణంగా 6, 7 నెట్ రన్ రేట్‌ను కూడా నమోదు చేయలేకపోతున్నది. ఇదే ఆ జట్టు కొంప ముంచుతున్నది. తమను భయపెడుతున్న గండాన్ని దాటే క్రమంలో చెన్నై టాప్-3 బ్యాటర్ల స్ట్రైక్ రేట్ 120.74 కాగా సగటు 17.86 మాత్రమే.

### రైనా నిష్క్రమణ తర్వాత ఢీలా..

2018కు ముందు సురేశ్ రైనా వంటి హిట్టర్లు ఆ జట్టులో ఉండగా 180+ టార్గెట్‌ను చెన్నై 9 సార్లు ఛేదించింది. తనదైన దూకుడుతో రైనా.. లక్ష్యాలను రాకెట్ స్పీడ్‌తో కరిగించేవాడు. రైనా వీడ్కోలు తర్వాత ఇదే టార్గెట్‌ను ఛేదిస్తూ చెన్నై ఒక్క మ్యాచ్‌లో కూడా నెగ్గలేదంటే అతడి ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు. దూబే వంటి ఆటగాడిని ఏరికోరి తెచ్చుకున్నా అతడు మెరుపులు మెరిపించిన సందర్భాలు స్వల్పం కాగా ఛేదనలో అయితే ఎప్పుడెప్పుడు పెవిలియన్ చేరుతాడా? అన్నట్టు ఆడుతున్నాడు. ఇక ప్రస్తుత, మాజీ సారథులు (రుతురాజ్, ధోనీ) ఆట కూడా ఘోరంగా ఉంది. ఆ 11 మ్యాచ్‌లలో రుతురాజ్ నాలుగుసార్లు డకౌట్ అయి 4 పర్యాయాలు సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యాడు. అత్యధిక స్కోరు 63 (మొత్తంగా చేసినవి 148 రన్స్). ఇన్నింగ్స్ ఆఖర్లో బ్యాటింగ్‌కు వస్తున్న ధోనీ సైతం గతంలో మాదిరిగా బ్యాట్ ఝుళిపించలేకపోతున్నాడు. 2023 సీజన్ నుంచి చెన్నై విజయాల్లో ధోనీ ప్రభావం (20.23 శాతం) చాలా తక్కువ. ఈ క్రమంలో అతడి సగటు 13.80గా నమోదైంది. అదే సమయంలో ఓడిన మ్యాచ్‌లలో 14 ఇన్నింగ్స్‌లలో బ్యాటింగ్‌కు వచ్చి చేసింది 272 పరుగులే. చెన్నై బలహీనతను సొమ్ముచేసుకుంటున్న ప్రత్యర్థి జట్లు.. తమకు మొదట బ్యాటింగ్ చేసే అవకాశమొచ్చినా ఎగిరి గంతేస్తున్నాయి. ఇదే ఒరవడి కొనసాగితే పాయింట్లపట్టికలో ఇప్పటికే 9వ స్థానంలో కొనసాగుతున్న సీఎస్‌కే మరోసారి లీగ్ దశకు పరిమితమైనా ఆశ్చర్య పడనక్కర్లేదు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.